క్లుప్తంగా

మెరిసిపోతున్న రహదారులు



గణేష్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో రహదారులు మెరిసిపోతున్నాయి. వార్డు పరిధిలో చాలా వరకు రహదారులను పునరుద్ధరించడంతో కళకళలాడుతున్నాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన రు.20 లక్షల నిధులతో బీటీ రోడ్లు నిర్మించారు. సీతంపేట రాధాకృష్ణ మందిరం నుంచి విజయ మెడికల్స్ వరకు ఉన్న గొల్ల వీధి, గణేష్ నగర్ చిన్న వినాయక గుడి నుంచి పాత పెట్రోల్ బంకు దుర్గమ్మ ఆలయం వరకు బీటీ రోడ్లు వేశారు. శిథిలమైన రహదారుల స్థానంలో కొత్తగా బీటీ రోడ్లు నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'స్పందన'కు 10 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ పేర్ని శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

సీతంపేట: విశాఖ వెల్డింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రఘు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓమ్ని ఆస్పత్రి, మంగమ్మ డెంటల్ క్లినిక్ సహకారంతో 200 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి శంకర్, సంయుక్త కార్యదర్శి విజయ్, వెంకటేష్, రాంబాబు, సిహెచ్.రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెంబడి చెత్త కుప్పలు



మర్రిపాలెం మెయిన్ రోడ్డులో షాపుల ముందు మురుగు వ్యర్థాలు

మర్రిపాలెం: రోడ్డు వెంబడి మురుగు కాలువలో తీసిన వ్యర్థాలను రెండు రోజులుగా వదిలేయడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. మర్రిపాలెం మెయిన్ రోడ్డులోని కాలువల నుంచి చెత్త తొలగించి పక్కనే వదిలేశారు. దీంతో ఇటు పాదచారులు.. అటు వాహన చోదకులకు, రోడ్డు పక్కనే ఉన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నడవాలంటే దుర్వాసన వస్తోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేకువజాము మొదలు రాత్రి వరకు ఇక్కడే ఉంటామని, భోజనం చేయాలంటే ఇబ్బందికరంగా ఉంటోందని చిరు వ్యాపారులు వాపోతున్నారు. దుర్వాసనతోపాటు మరో పక్క దోమలు దాడి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం



యువజనోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న స్వామి గీతాసరానంద

- యువత వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి
- రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామి గీతాసరానంద
- కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఘనంగా యువజనోత్సవం

మురళీనగర్: విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని యువతకు రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామి గీతాసరానంద సూచించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం పట్ల భక్తి, అనురక్తి కలిగి ఉన్నప్పుడే మన దేశం మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. వివేకానందుడి బోధనలు విశ్వం ఉన్నంత కాలం అనుసరణీయాలని వివరించారు. నేటి యువత బాహుబలంతోపాటు బుద్ధి బలం, ఆత్మబలం కలిగి ఉండాలన్నారు. త్యాగం, మానవ సేవ వంటి ఉత్తమ లక్షణాలను విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు.

విజేతలకు బహుమతులు..

కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించి పోటీల్లో విజేతలకు స్వామి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జీఈ రాజు, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ జి.వి.లక్ష్మణరావు, పెట్రో కెమికల్స్ విభాగం హెడ్ సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, బి.రామాజనేయులు, బి.హెచ్.ప్రదీప్‌కుమార్, డి.దామోదర్, ఎస్.పి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు సీఎం జగన్



కార్పొరేటర్లు, పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఘనంగా ప్రజాసంకల్ప యాత్ర నాలుగేళ్ల సంబరాలు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సేవకే అంకితమయ్యారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. సీఎం చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. కార్పొరేటర్లు, పార్టీ శ్రేణుల మధ్య ఆయన కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పనిచేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న తరుణంలో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ప్రజలతో స్వయంగా మమేకమై వారి కష్టాలను తెలుసుకున్నారన్నారు. దాని ఫలితంగానే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అంచెలంచెలుగా సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గడిచిన మూడున్నరేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, మాజీ కార్పొరేటర్లు బాక్సర్ రాజు, కె.వెంగళరావు, బులుసు జగదీష్, పార్టీ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, డి.శ్రీనివాసరావు, కె.వి.బాబా, డైరెక్టర్లు, అధ్యక్షులు, సభ్యులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కె.కె.రాజు, కామేశ్వరి

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు పెద కొత్తూరు, అరుంధతి నగర్ సచివాలయాల పరిధిలో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. కొండవాలు, మురికివాడ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంతిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అభివృద్ధి సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు, రాయుడు శ్రీను, వార్డు నాయకులు కోరిబిల్లి విజయ్, వి.అప్పారావు, రాఘవులు, రమణ, లక్ష్మణరావు, కృపా, సాయి, సురేష్, కె.గురువోజీ, సాగర్, రమేష్, భోగేశ్వరరావు, జె.కుమార్, గోవింద్, నాగరాజు, అప్పన్న దొరరాజు, అనసూయ, శంకరరావు, హరిపట్నాయక్ బాబ్జీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి హెల్పింగ్ బాయ్స్ సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ బాయ్స్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలో నివసిస్తున్న యేసు అనే వ్యక్తికి హెల్పింగ్ బాయ్స్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. యేసు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత డిసెంబర్‌లో పెయింటింగ్ పనులు చేస్తూ మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఇతడికి విమ్స్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం కుటుంబ పోషణ నిమిత్తం హెల్పింగ్ బాయ్స్ సోమవారం క్షతగాత్రుడి ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో ఈశ్వర్, శ్రీను, రెడ్డి, జానీ, చంటి, టింకు, కుమార్, శ్రీధర్, అప్పలస్వామి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సంస్కృతి సదన్



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న విదేశీ బృంద సభ్యులు, సంస్థ డైరెక్టర్ సత్యదేవ్

తాటిచెట్లపాలెం: సామాన్య ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా జగద్గురు పీఠం ఆధ్వర్యంలో మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌ను స్థాపించినట్లు సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. తాటిచెట్లపాలెంలోని సంస్కృతి సదన్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సంస్థను సందర్శించిన విదేశీ బృంద సభ్యులు క్రిస్టినా, మార్కర్ఫ్, డాక్టర్ సెబీనాల చేతుల మీదుగా ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సదన్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 69 బ్యాచ్‌ల్లో 1,600 మంది మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విదేశీ బృంద సభ్యులు మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య(ఇ.కె.), మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్‌ల బోధనలు, రచనలు తమనెంతో ప్రభావితం చేవాయని, మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నమన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహక సభ్యులు పి.రవిశంకర్, పసుమర్తి కృష్ణమోహన్, మహాత్మా గాంధీ మహిళా కేంద్ర నిర్వాహకురాలు దాట్ల రాధ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ అభ్యర్థులకు మౌఖిక పరీక్ష రేపు



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాలెం: అంగన్‌వాడీ కేంద్రం ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 11న కలెక్టర్ కార్యాలయంలోని ఆర్డీవో ఆఫీస్‌లో మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్టు అర్బన్-1 సీడీపీవో ఎం.వి.రమణికుమారి తెలిపారు. మౌఖిక పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూ ధ్రువపత్రాలను అందజేశారు. అర్బన్-1 పరిధిలో మొత్తం ఖాళీలు 20 ఆయా పోస్టులకు సంబంధించి 58 మంది మౌఖిక పరీక్షకు ఎంపికయ్యారన్నారు. 100 మార్కులకు పరీక్ష ఉంటుందని, ఆరోజు ఉదయం 9.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

వాకర్స్ పార్కు అభివృద్ధికి సహకారం



ముఖద్వారాన్ని ప్రారంభించి పార్కులోకి ప్రవేశిస్తున్న చక్రధర్ దంపతులు

మురళీనగర్: వాకర్స్ పార్కు అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని శ్రీచక్ర వెంచర్స్ అధినేత గద్దె చక్రధర్ తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ఆధునిక ముఖద్వారాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రానున్న కాలంలో పార్కులో కల్పించాల్సిన అదనపు సౌకర్యాలకు సహకరిస్తానన్నారు. ముందుగా గద్దె చక్రధర్, పద్మశ్రీ దంపతులు పూజలు చేసి ముఖ ద్వారాన్ని తెరిచి వాకర్స్‌తో కలిసి పార్కులోకి ప్రవేశించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ హుద్‌హుద్ తుపాను విధ్వంసంలో పూర్తిగా పాడైన పార్కులో పచ్చదనం పునరుద్ధరణ, ఇతర సౌకర్యాల కల్పనకు చక్రధర్ సాయం అందించారని తెలిపారు. మురళీనగర్‌లోనే మొట్టమొదటి పార్కుగా గుర్తింపు పొందిన వాకర్స్ పార్కుకు ఆధునిక ముఖద్వారం నిర్మించినందుకు ఆయనకు క్లబ్ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చక్రధర్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, వైశాఖీ స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, పూర్వ అధ్యక్షులు కె.ద్వారకానాథ్, ఎం.భాస్కరరావు, జె.కూర్మారావు, మళ్ల రామకృష్ణ, ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.

జోన్-5 ఏసీపీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన రమణమూర్తి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా ఐ.వి.రమణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఉత్తర్వుల మేరకు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జోన్-5లో పనిచేసిన ఏసీపీ ఎం.అరుణవల్లి గాజువాక జోన్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రమణమూర్తిని జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అభినందించారు. కొత్త ఏసీపీ మాట్లాడుతూ జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63 వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని జోన్ ప్రజలకు సూచించారు.

అలరించిన సింగర్ కిశోర్‌కుమార్ గీతాలు



సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు

సీతంపేట: ప్రముఖ గాయకుడు కిశోర్‌కుమార్ గీతాలు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్‌ప్రసాద్ అన్నారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు కిశోర్‌కుమార్ జ్ఞాపకార్థం మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి సంగీత సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి నిర్వహించారు. ఎమ్మెస్ మాధవ్, నిహారిక పాడిన జానెజా దూండ్తా, హేమంత్‌కుమార్, శైలజ పాడిన భీగి భీగి రాతోన్‌మే, ప్రభాకర్, ఎస్.రాజేశ్వరి పాడిన కోరా కాగజ్ థా, అమ్మాజీరావు, సీవీ రాజేశ్వరి పాడిన కాంచిరే కాంచిరే, ప్రభాకర్, లక్ష్మీసాత్విక పాడిన గాత రహే మేరా దిల్, ఎస్ఎస్ఎన్ రాజు పాడిన రోటే హూ ఆటే హైసాద్ వంటి పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో న్యాయవాది బైపా అరుణ్‌కుమార్, కొణతాల రాజు, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు హిజ్రా వర్గాల మధ్య ఘర్షణ

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు హిజ్రా వర్గాల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. సోమవారం మధ్యాహ్నం సరస్వతీ పార్క్ సమీపంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్టు సమాచారం. అయితే అదే గొడవ మళ్లీ కంచరపాలెం మెట్టు దగ్గర వారి ఇంటి వద్ద చోటుచేసుకోవడంతో ఇరు వర్గాల వారు ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నట్టు సమాచారం. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిరోధించండి



గొండు సీతారామ్‌కు వినతిపత్రం అందిస్తున్న టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి పండగ సెలవుల్లో ప్రత్యేక తరగతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ స్కూళ్లు, కాలేజీల్లో చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళ్ల లోకనాథం, జిల్లా కన్వీనర్ కోట్ల గణేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆశీలమెట్టలోని కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ సెలవుల్లో నూటికి నూరు శాతం అమలు జరిగేలా తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల ఆర్ఐవోలు, డీఈవోలకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే వాటి గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలకు సిఫార్సులు చేయనున్నామని ఆయన చెప్పారు.

20 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రైల్వేస్టేషన్ దరి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది మహ్మద్ యాషిన్ అనే వ్యక్తి వద్ద సోదాలు చేయగా 20 కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అతడిని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఫోర్తుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్‌కు జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నగర అథ్లెట్ వై.జ్యోతి పాల్గోనుంది. ఇందులో పాల్గొనేందుకు భారత్ తరఫున 13 మంది చొప్పున వుమెన్, మెన్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఎంపిక చేసింది. వంద మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన విశాఖ అథ్లెట్ జ్యోతి జట్టుకు ఎంపికైంది. కజకిస్తాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో 60 మీటర్ల స్ప్రింట్‌తోపాటు 60 మీటర్ల హార్డిల్స్‌లో పాల్గోనుంది.

16న బౌద్ధ మేళా

పెదగంట్యాడ: అనకాపల్లిలోని బుద్ధుని కొండపై ఈ నెల 16న నిర్వహించనున్న బౌద్ధ మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా మహాబోధి సొసైటీ అధ్యక్షుడు గుణుపూడి బాబు మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం బౌద్ధ పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. కొండ ప్రవేశ ద్వారం నుంచి పంచశీల శాంతి యాత్ర నిర్వహించనున్నామని ఆయన చెప్పారు.

25వ రోజు.. విశేష పూజలు



వెంకటాద్రిపై స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: ధనుర్మాస పూజలను 25వ రోజు సోమవారం విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై స్వామికి సుప్రభాత సేవ అనంతరం విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణ చేశారు. గోదాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పూజలు చేశారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి గోదాదేవి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- పెందుర్తి వెంకటాద్రిపై సోమవారం స్వామికి తిరుప్పావై సేవాకాలం, గోదాదేవికి, వేంకటేశ్వర స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

యోగానంద నారసింహుడిగా అప్పన్న



అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి యోగానంద నారసింహస్వామి అలంకరణలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని యోగానంద నారసింహుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంపజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఉర్సు ఉత్సవానికి కె.కె.రాజుకు ఆహ్వానం



నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ముస్లిం పెద్దలు

సీతమ్మధార: ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించే హజ్రత్ మౌలా అలీ, హజ్రత్ ఖాదర్ వలీ ఉర్సు-2023 ఉత్సవానికి రావాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుకు ముస్లిం పెద్దలు ఆహ్వాన పత్రిక అందించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనను ముస్లింలు కలిశారు. 13వ తేదీన గ్రంథ ఉత్సవం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జ్ఞానేష్, ఉత్సవ కమిటీ సభ్యులు బాబా, గౌస్, ఉమర్, ఎస్.కె.మున్నా తదితరులు పాల్గొన్నారు.